
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.8, కనిష్ఠం 12.7
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
ఆదివారం 9 ఫిబ్రవరి 2025





● ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తరలించిన కందులు

- జిల్లాలో 3.50 లక్షల క్వింటాళ్ల కంది దిగుబడి అంచనా
- ఎకరానికి 10 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని ప్రతిపాదన
- అత్యవసరం పేరిట దళారులకు అమ్మేసుకుంటున్న రైతులు
- ప్రభుత్వ ఆదేశాల కోసం తప్పని ఎదురుచూపులు
- జిల్లావ్యాప్తంగా మొత్తం 60 వేల ఎకరాలలో సాగైన కంది పంట

కంది కొనుగోళ్లకు.. పరిమితులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానంగా పండించే పత్తి, సోయా పంటల తర్వాత కంది పంటను రైతులు ఎక్కువగానే సాగు చేస్తారు. ఇప్పటికే పంట దిగుబడులు చేతికి రావడంతో అమ్మేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈసారి కూడా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కంది కొనుగోళ్లను చేపడుతున్నారు. గత వారం రోజుల క్రితమే ఆదిలాబాద్, జైనథ్, బోథ్, ఇంద్రవెల్లి మండలాల్లో కంది కొనుగోళు కేంద్రాలను ప్రారంభించారు. అయినా ఇప్పటి వరకు అంతంత మాత్రంగానే కందులు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఎందుకంటే కొనుగోళ్లలో పరిమితు లు విధించడంతో రైతులు పంట దిగుబడులను అమ్మేందుకు తర్జనభర్జన పడుతున్నారు. ఈయేడు జిల్లావ్యాప్తంగా 60 వేల ఎకరాలలో కంది పంట సాగయ్యింది. దీంతో 3.50 లక్షల క్వింటాళ్ల కంది దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు వెయ్యి క్వింటాళ్ల లోపే కందులను కొనుగోలు చేసినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో అంతర, పూర్తిస్థాయిలో కంది పంటను సాగు చేశారు. దీంతో ఆశించిన దిగుబడులే కనిపిస్తున్నా యి. కానీ ప్రభుత్వం ఎకరాన 3.31 క్వింటాళ్ల కందులను కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇవ్వడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. మిగితా పంటను ఎక్కడ అమ్ముకోవలెనో అర్థంకాక అయోమయానికి గురవుతున్నారు. రైతుల డిమాండ్ మేరకు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ ఇటీవలే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు కూడా ఎకరాన 6నుంచి 10క్వింటాళ్ల వరకు కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.


అంచనాలు ఏమైనట్లు?

పంట చేతికి వచ్చిన సమయంలో అధికారులు క్రాప్‌కటింగ్ ఎక్స్‌పర్‌మెంట్‌ను చేపట్టి దిగుబడుల అంచనా వేస్తారు. దీని ఆధారంగానే ప్రభుత్వం ఎకరాన ఎన్ని క్వింటాళ్లను కొనుగోలు చేయాలన్నది నిర్ధారిస్తోంది. జిల్లాలో ఎకరాన 4నుంచి 6 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేసినట్లు తెలుస్తుంది. కానీ ప్రభుత్వం ఎకరా న 3.31 క్వింటాళ్లను కొనుగోలు చేసేందుకు ఆదేశాలు ఇవ్వడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలో సాధారణంగా నీటివసతి ఉన్న పంట భూముల్లో ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడులు రాగా.. వర్షాధారంగా పండించిన భూముల్లో ఎకరాన 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు. అధికారులు నామమాత్రంగా పంట దిగుబడులను అంచనా వేయడంతోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కనీసం సాగు అనుభవం ఉన్న రైతుల అనుభవాలు, అంచనాలను పరిగణలోకి తీసుకోవడం లేదు. ఇలాంటి పరిస్థితులతోనే పంటల కొనుగోళ్లకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. తాజాగా ఎకరాన 6 నుంచి 10 క్వింటాళ్ల వరకు కంది కొను గోళ్లను చేపట్టాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. తదుపరి ప్రభుత్వ ఆదేశాలు వస్తే కొనుగోళ్ల వేగవంతమయ్యే అవకాశం కనిపిస్తోంది.

ముందుచూపు ఏది?

అధికారుల అంచనా ప్రకారమే ప్రభుత్వం పంట దిగుబడులను కొనుగోలు చేసేందుకు పరిమితులను విధిస్తుంది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం దానికి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. అధికారులే పంట దిగుబడులను

(తరువాయి 6వ పేజీలో...)



అనుమతులు రావాల్సి ఉంది

: గజానంద్, మార్కెటింగ్ శాఖ అధికారి, ఆదిలాబాద్



ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. దానికి అనుగుణంగానే కందులను కొనుగోలు చేస్తాం. ప్రస్తుతం ఎకరాన 3.31 క్వింటాళ్లను కొనుగోలు చేస్తున్నాం. దీంతో రైతుల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. ఇటీవలే ఎకరాన 6క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని ప్రతిపాదనలు పంపించడం జరిగింది. ప్రభుత్వ ఆదేశాలు రాగానే కొనుగోలు చేపడుతాం. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే కందులను తరలించి మద్దతు ధరను పొందాలి.

ఫటా..ఫట్...

ఆర్‌వోఎఫ్‌ఆర్ లబ్ధిదారులకు 150 రోజుల పని దినాలు

● రవీందర్‌రాథోడ్, డీఆర్డీవో పీడీ, ఆదిలాబాద్



ఆంధ్రజ్యోతి: గిరిజన రైతులకు ప్రత్యేకంగా ఎలాంటి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు?

అధికారి: ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు పొందిన గిరిజన రైతులకు 150 రోజుల పనిదినాలను కల్పించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. జిల్లాలో ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు పొందిన రైతులు 26,352 మంది ఉన్నారు. వీరందరికి 150 రోజుల పని దినాలు కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: మహిళలకు ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారా?

అధికారి: జిల్లాలో మహిళలకు మెరుగైన ఉపాధిని కల్పించేందుకు ప్రత్యేకంగా ఇందిరమ్మ మహిళ శక్తి పథకం కింద ఉపాధిని కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు 4344 మంది లబ్ధిదారులకు బ్యాంకు రుణాలను అందించి ఉపాధిని కల్పించాం. వారు సాధిస్తున్నా పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. అలాగే ఇటీవలే నార్నూర్ మండలం ఖైరదాట్‌వా గ్రామంలో మోహాలడ్డు తయారీ యూనిట్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: రుణాల వసూలు, బ్యాంకు లింకేజీ రుణాలపై దృష్టి సారిస్తున్నారా?

అధికారి: మునుపెన్నడూ లేని విధంగా బ్యాంకు రుణాల వసూలుపై ప్రత్యేకదృష్టిని సారిస్తున్నాం. జిల్లాలో ఎలాంటి రుణబకాయిలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా 152 వీవోస్ రుణాల వసూలుపై నిరంతరంగా దృష్టి సారించి ఇప్పటికే ఫలితాలను సాధించాం.

ఆంధ్రజ్యోతి: ప్రస్తుతం అక్రమాలను ఎలా అరి కడుతున్నారు?

అధికారి: ఉపాధి హామీలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమాలను గుర్తిస్తున్నాం. వాటికి చెక్ పెట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించాం. ఇప్పటి వరకు నిర్వహించిన సామాజిక తనిఖీల్లో 39వేలకు పైగా అభ్యంతరాలు వచ్చాయి. ఇకపై జిల్లా కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తాం. ఎలాంటి అవినీతి అక్రమాలు జరుగకుండా కూలీలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో నర్సరీల నిర్వాహణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

అధికారి: పట్టణ, గ్రామాల్లో నర్సరీలను నిర్వహించేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశాం. ఈ యేడు 46లక్షల మొక్కలను పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే దాననుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గిరి వికాసం పథకం అమలులో ఎదురవుతున్న ఆటంకాలను ఎలా అధిగమిస్తారు?

అధికారి: ముఖ్యంగా జిల్లాలో గిరి వికాసం పథకాన్ని అమలు చేయడం ఎంతో అవసరం ఉంది. సారవంతమైన నల్లరేగడి నేలలు అందుబాటులో ఉన్న నీటివసతి లేక బీడుభూములుగా మారుతున్నాయి. ఇప్పటి వరకు కొంతమంది రైతులకు బోరుబావులు తవ్వించి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించడం జరిగింది. కొన్ని చోట్ల అటవి శాఖ పరమైన ఇబ్బందులు ఎదురవుతున్న ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి అధిగమించే ప్రయత్నం చేస్తున్నాం. నిధులు మంజూరు కాగానే పూర్తిస్థాయిలో అమలుకు శ్రీకారం చుడుతాం.

- ఆదిలాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి)



ప్రత్యేక పూజలు చేస్తున్న బాబా తనయుడు ఇంగ్లే కేశవ్

పూలాజీ బాబా చూపిన మార్గంలో నడవాలి : కేశవ్ రావు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పూలాజీబాబా చూపిన ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని బాబా తనయుడు, పట్నాపూర్ సిద్దేశ్వర్ సంస్థాన్ ఆధ్యక్షుడు ఇంగ్లే కేశవ్‌రావు అన్నారు. శనివారం మండలంలోని హర్కాపూర్(ఆందుగూడ) గ్రామంలో పూలాజీ బాబా ధ్యానకేంద్రం వార్షికోత్సవంలో భాగంగా ఆధ్యాత్మిక సత్ సంఘ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. తర్వాత గ్రంథ పూజ, ధ్యాన్ ధారణ, పూలాజీ బాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు వ్యసనాలకు దూరంగా ఉండి బాబా చూపిన భక్తి బావాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం ధ్యాన మందిర కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నవితరణ చేశారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, మాజీ సర్పంచ్ కుడే కైలాష్, ధ్యాన కేంద్రం సంస్థాన్ అధ్యక్షుడు పాంద్రే నారాయణ, హెచ్‌ఎం శ్రీరామ్, ఏకలవ్య ప్రాజెక్టు మేనేజర్ డిగాంబర్, తదితరుల్గున్నారు.

క్షయ నివారణపై అవగాహన కలిగి ఉండాలి : జిల్లా వైద్యాధికారి

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): క్షయ(టీబీ) వ్యాధి నివారణపై అవగాహన ఉండాలని అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కుడ్మేత మనోహర్ అన్నారు. శనివారం మండలంలోని వడ్‌గాం, వాల్గొండ, తదితర గ్రామాల్లో క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పించి మందులు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా ఇస్తారని, వాడాల్సిన విధానం గురించి, టీబీ నిర్ధారణ అయిన తర్వాత తీసుకోవాల్సిన పోషక ఆహారం, పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉండటం, గళ్ల పడటం లాంటి లక్షణాలుంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఈ పరీక్షలన్నీ ఉచితంగా చేస్తామన్నారు. ఛాతిలో నొప్పి, జ్వరం, ఆకలి మందగించడం లాంటి లక్షణాలుంటే అశ్రద్ధ చేయకుండా టీబీ పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే సంబంధిత రోగులకు ఉచితంగా టీబీ మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో నాందేవ్, హెచ్‌ఈవో ప్రియాంక, పీహెచ్‌సీ రాథోడ్ గోకుల్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అదనపు జిల్లా వైద్యాధికారి

ఢిల్లీలో బీజేపీ గెలుపు.. పార్టీ శ్రేణుల సంబరాలు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ స్థానాలతో గెలుపొందడంతో మండల బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. శనివారం మండల కేంద్రంలో పాసులు కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఇందులో మండల అధ్యక్షుడు ఆరేళ్లి రాజలింగం, మహిళా మోర్చా అధ్యక్షురాలు రాథోడ్ రాధిక, నాయకులు మెస్రం తుకారం, కనక హనుమంతు, మోరే దిలిప్, దీపిక్‌సింగ్ శేకవత్, దేవపూజ్ మారుతి, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీ ఘన విజయం సాధించడంలో పార్టీ స్థానిక నాయకులు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సంబురాలు నిర్వహించుకున్నారు. పార్టీ రాష్ట్ర నాయకుడు రాథోడ్ రితేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ అవినీతి, అక్రమాల ఊబిలో కూరుకుపోయిన ఆమ్ ఆద్మీ పార్టీని ప్రజలు తిరస్కరించారని అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని అన్నారు. అనంతరం బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఇందులో జాదవ్ సుమన్ భాయి, కొండేరి రమేష్, సీపతి లింగాగౌడ్, రాథోడ్ శేషారావు, దావులె బాలాజీ, కందుకూరి రమేష్, బింగి వెంకటేష్, సాడి గే రాజేశ్వర్, శ్రీకాంత్, కాల్వ రవి, ఉస్కెమల్ల దేవిదాస్, తస్నీరు, తదితరులున్నారు.

ఆదిలాబాద్: ఢిల్లీ తీర్పే రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రిపీట్ అవుతుందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వేదవ్యాస్ పేర్కొన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ భారీ విజయం సాధించడం పట్ల ఆదిలాబాద్‌లో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ పాలనను ఢిల్లీ ప్రజలు తిరస్కరించారన్నారు. రానున్న కాలంలో బీజేపీ మరిన్ని విజయాలు సాధిస్తుందన్నారు.

బోథ్: ఢిల్లీలో బీజేపీ అధికారాన్ని కైవసం చేసుకోవడంతో బోథ్‌లో పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మండల కన్వీనర్ ఆధ్వర్యంలో టపాకాయలు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. వారు మాట్లాడుతూ ప్రజలు బీజేపీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి మద్దతు ఇస్తున్నారన్నారు. ఇందులో పార్టీ జిల్లా నాయకులు, రైల్వే బోర్డు మాజీ సభ్యుడు జివి రమణ, స్థానిక నాయకులు జక్కుల వెంకటేష్, సురేష్ వైద్య, శేఖర్, తుకారం, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో సంబరాలు చేసుకుంటున్న నాయకులు



ఆదిలాబాద్ పట్టణంలో పార్టీ నాయకుల సంబరాలు...



బోథ్‌లో నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు



ఇంద్రవెల్లిలో టపాసులు కాలుస్తున్న బీజేపీ శ్రేణులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మాజీ ఎంపీ



మాట్లాడుతున్న సోయం బాపురావు

క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి

● మాజీ ఎంపీ సోయం బాపురావు

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గ్రామీణస్థాయి నుంచి జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో యువత రాణించాలని మాజీ ఎంపీ సోయం బాపురావు అన్నారు. శనివారం మండలం పరిధిలోని చింతల్‌సాంగ్వి గ్రామంలో గల ఆదివాసీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ టోర్నమెంటును సోయం బాపురావు ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడలను ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గ్రామీణ స్థాయిలో క్రీడలలో పాల్గొన్నపుడే వారి శక్తి సామర్థ్యాలు వారితో పాటు అక్కడున్న నలుగురికి వారిలో దాగి ఉన్న ప్రతిభ కనిపిస్తుందన్నారు. క్రీడాకారులలో దాగి ఉన్న ప్రతిభ నలుగురికి తెలిపే విధంగా యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ టోర్నమెంటును నిర్వహించడం అభినందనీయమని వారిని కొనియాడారు. గ్రామస్థులు కూడా వారికి తోడుగా నిలిచి ప్రోత్సహించడం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్కె పాండరంగ్, నాయకులు జడల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ మునేశ్వర్ నారాయణ, మాజీ వైస్ ఎంపీటీసీ పోరెడ్డి శ్రీనివాస్, పటేల్ భీంరావు, ఇర్ల శివుడు, సామన్‌పల్లి శేఖర్, జగదీశ్, లక్ష్మణ్, భూమన్న, మారుతి, సీడం సుభాష్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

● గెలుపే లక్ష్యంగా పని చేయాలి

తలమడుగు రూరల్: త్వరలో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త సైనికుల్లాగా పని చేయాలని మాజీ ఎంపీ సోయం బాపూరావు కోరారు. శనివారం మండలంలోని ఝరి పూనగూడ మాజీ సర్పంచ్ రఘునాథ్, గ్రామస్థులు, పార్టీ కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ సోయాం బాపూరావు ఝరీ పూనగూడ గ్రామస్థులు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే ప్రధాన లక్ష్యంగా గ్రామాలలో పని చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం వచ్చిన మొదటి సంవత్సరంలోనే ఎన్నికల మేనిఫెస్టోకు అనుగుణంగా అనేక రకమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ రైతులకు, రైతు కూలీలకు ప్రభుత్వ ఉద్యోగులకు, నిరుద్యోగులకు, మహిళలకు, ప్రజా ప్రభుత్వంలో పెద్దపీట వేయడం జరిగింది. గతంలో ఏ ప్రభుత్వం కూడా అమలు చేయనటువంటి ప్రధానమైనటువంటి సంక్షేమ పథకం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం, భూమిలేని కూలీలకు వర్తిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఉఉపాధిహామీ జాబ్ కార్డు ఉండి కనీసం వార్షిక సంవత్సరంలో 20 పనిదినాలు పని చేసి ఉన్న ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేయడం జరుగుతుందని, ఈ పథకం దేశంలో ఎక్కడా అమలు చేయడం లేదని వివరించారు. కచ్చితంగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకుని వెళ్లి వారికి లబ్ధి చేకూరేలా మీరందరూ కష్టపడి పని చేయాలని దిశా నిర్దేశం చేశారు.

నాణ్యమైన విద్యను అందించాలి : డీఈవో

ఆదిలాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): బోధన అభ్యసన పరికరాలను వినియోగించుకుంటూ నాణ్యమైన విద్యను అందించేల ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో ప్రణీత అన్నారు. శనివారం గజిటెడ్ నంబర్ వన్ పాఠశాలలో ఉపాధ్యాయులకు డిజిటల్ బోధనలో భాగంగా ఐఎఫ్‌పీ, ఎంఎల్‌ఎస్‌పై శిక్షణను నిర్వహించారు. దీనికి డీఈఓ ప్రణీత ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కాగా మాస్టర్ ట్రైనర్లు ఎం.సవితదేవి, ఎన్.నిరోజనలు డిజిటల్ బోర్డుపై ఏవిధంగా బోధించాలో వివరించారు. ఈ సందర్భంగా డీఈఓ ప్రణీత మాట్లాడుతూ డిజిటల్ బోధనలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధనలు చేయాలన్నారు. మారుతున్న కాలంతోపాటు సాంకేతిక పరిజ్ఞానం వినియోగం విద్య వ్యవస్థలో చాలా అవసరమన్నారు. శిక్షణలో నేర్చుకున్న వాటిని తరగతి గదుల్లో విద్యార్థులకు తెలియజేస్తూ వారిలోని సృజనాత్మకను బయటకు తీసేల కృషి చేయాలని సూచించారు. ఇందులో సెక్టోరియల్ అధికారి సుజాత్ ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'11న కళాకారుల సమ్మేళనం'

ఆదిలాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంస్కృతిక కళా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 11న కళాకారుల సమ్మేళనం, కళా ఉత్సవం అవార్డు ప్రదానం కార్యక్రమాన్ని నిర్మల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు పాలకొండ దత్తు తెలిపారు. ఆదిలాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కళాకారుల సమ్మేళన పోస్టర్లను ఆవిష్కరించారు.

'వర్గీకరణ కలను సీఎం నెరవేర్చారు'

ఆదిలాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ముప్పై ఏళ్ల వర్గీకరణ కలను సీఎం రేవంత్ రెడ్డి నెరవేర్చారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య అన్నారు. అసెంబ్లీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా పురస్కరించుకొని సంబరాలు జరుపుకున్నారు. శనివారం అంబేద్కర్ చౌక్‌లో సీఎం రేవంత్, మంత్రుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం మిఠాయిలు తినిపించుకున్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య మాట్లాడారు. కార్యక్రమంలో చర్మ కార్మిక సంఘం అధ్యక్షులు బిక్కి గంగన్న, లక్ష్మణ్, దర్శనాల నగేష్, నసీం ఖాన్, అశోక్, లాజర్, అశోక్, పొచ్చన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'

ఆదిలాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరిగి గులాబీ జెండా ఎగిరెలా కృషి చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్ రూరల్ మండల ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్ ప్రజా సంక్షేమాన్ని మరిచి అభివృద్ధి పక్కతోవ పట్టిస్తూ తన కబ్జాల వ్యాపారానికి తొలి ప్రాధాన్యం ఇవ్వడం సిగ్గు చేటన్నారు. అలాగే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ప్రజల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమయ్యిందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తే ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఇందులో నాయకులు రౌతు మనోహర్, నారాయణ, యాసం నర్సింగరావు, మెట్టు ప్రహ్లాద్, లింగారెడ్డి, సేవ్వజగదీశ్, మార్శెట్టి గోవర్ధన్, చందాల రాజన్న, ప్రమోద్‌రెడ్డి, తదితరులున్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

రాముల గుట్ట అభివృద్ధికి కృషి

● జాతరను ప్రారంభించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



కలశంతో రాముల గుట్ట ఎక్కుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

తాంసి రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో గల రాముల గుట్టను అభివృద్ధి చేసేందు కోసం కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం అక్కడ జాతర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఆయన తలపై కలశాన్ని మోస్తూ గుట్టని ఎక్కారు. అనంతరం పూజలో పాల్గొని తీర్థప్రసాదాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉన్న ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● శివపార్వతుల కల్యాణానికి హాజరుకండి

బోథ్: సోనాల మండలంలోని శివపార్వతుల కల్యాణం ఈనెల 24న జరగనుందని, కల్యాణ మహోత్సవానికి రావాలని మండల కేంద్రానికి చెందిన భక్తులు శనివారం ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను కలిసి విన్నవించారు. ఈ ఏడాది కల్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నందున కార్యక్రమానికి హాజరు కావాలని కోరడం జరిగిందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. వారిలో చిలుకూరి నరేందర్, సోమ గంగారెడ్డి, సుధీర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మునేశ్వర్, సోమన్న, అమృతరావు పాటిల్, బీమరావు పాటిల్, తదితరులున్నారు.

● యువకులు క్రీడాల్లో రాణించాలి

ఆదిలాబాద్: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లోని నైపుణ్యాలను వెలికి తీయడానికి మాజీ సీఎం కేసీఆర్ క్రీడా మైదానాలను ఏర్పాటు చేశారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గుర్తు చేశారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాంద సమీపంలో మైదానంలో మాజీ మంత్రి జోగు రామన్న తల్లిదండ్రులు ఆశన్న-భోజమ్మ జ్ఞాపకార్థం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి మ్యాచ్‌లను ప్రారంభించారు. అనంతరం బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అజయ్, సాజిదొద్దీన్, పవన్ నాయక్, యూనిస్ అక్బాని, నారాయణ, ప్రహ్లాద్, శివ, అయ్యాబ్, తదితరులు పాల్గొన్నారు.

● బాధిత కుటుంబాలకు పరామర్శించిన ఎమ్మెల్యే

తలమడుగు రూరల్: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన గోక మహేందర్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారి స్వగృహంలో ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం రుయ్యాడి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గంగాధర్ తండ్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారిని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కంది కొనుగోళ్లకు పరిమితులు

(5వ పేజీ తరువాయి...)

అంచనా వేస్తున్నా.. రైతుల్లో మాత్రం ఆందోళన వ్యక్తమవుతోంది. దళారీ వ్యవస్థను అరికట్టేందుకు పరిమితులు విధించాల్సి వస్తోందని అధికారులు చెబుతున్నారు. అయినా పంటల సాగు లెక్కలు, దిగుబడుల అంచనాలు అధికారుల వద్ద ఉన్నా.. ఎందుకు పరిమితులు విధిస్తున్నారో? అర్థం కావడం లేదని రైతులు వాపోతున్నారు. ఎలాంటి అక్రమాలు జరుగకుండా పంట దిగుబడులను కొనుగోలు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. అయినా ఆంక్షలు విధించడం ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ముందే రైతుల అభిప్రాయం మేరకు పంట దిగుబడులను కొనే విధంగా చర్యలు తీసుకుంటే ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేది కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొనుగోళ్లు ప్రారంభించిన తర్వాత మళ్లీ పరిమితులు పెంచాలని ప్రతిపాదనలు పంపించే అవసరం కూడా ఉండదంటున్నారు. గత వానాకాలం సీజన్‌లో సోయా కొనుగోళ్లలోను ఇదే పరిస్థితి ఎదురయ్యింది. రైతుల నుంచి డిమాండ్లు రావడంతో ప్రభుత్వానికి పరిమితులు పెంచక తప్పలేదు.

ప్రైవేట్ వైపే రైతుల మొగ్గు

ఈయేడు కంది పంటకు ప్రభుత్వ మద్దతు ధర రూ.7550 కాగా, ప్రైవేట్ మార్కెట్‌లో ప్రస్తుతం రూ.6900 నుంచి రూ.7వేల వరకు ధర పలుకుతుంది. అయినా రైతులు ప్రైవేట్ వైపే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఎందుకంటే చిన్న, సన్నకారు రైతులకు 5-10 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయి. వీటిని ప్రభుత్వ కొనుగోళ కేంద్రానికి తీసుకెళ్లి విక్రయించడం ఇబ్బందికరంగా ఉంటుందని భావిస్తున్నారు. దీంతో స్థానికంగా అందుబాటులో ఉన్న ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి అమ్మేసుకుంటున్నారు. తక్కువ దిగుబడులు వచ్చిన రైతులంతా ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించగా.. అధికమొత్తంలో దిగుబడులు వచ్చినా.. రైతులు మాత్రం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలిస్తూ పంటను అమ్మేసుకుంటున్నా రు. ఇలాంటి పరిస్థితులతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ఆశించిన స్థాయిలో కందులు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. కొన్ని కేంద్రాలలో ఇప్పటి వరకు క్వింటాల్ కందులను కూడా కొనుగోలు చేసిన పరిస్థితి లేదు. అత్యవసరాల పేరిట ఇప్పటికే సగానికి పైగా కందులను అమ్మేసుకున్నట్లు తెలుస్తుంది.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన యువకుడి ఇంట్లో యువతి తిష్ట

బోథ్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన ఓ యువతి తనను గ్రామానికి చెందిన నవీన్ జాదవ్ అనే యువకుడు తనను నమ్మించి మోసం చేశాడని యువకుడి ఇంట్లో తిష్ట వేసింది. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేయడం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. నారాయణపూర్ గ్రామానికి చెందిన యువతి సదరు యువకుడి మధ్య గత ఏడాదికాలంగా ప్రేమ వ్యవహారం కొనసాగుతోంది. అయితే ఈ విషయం నెల రోజుల క్రితం బయటపడటంతో గ్రామపెద్దల సమక్షంలో పంచాయతీ సైతం నిర్వహించారు. ఆ తర్వాత తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో గత నెల 29న స్థానిక పోలీస్ స్టేషన్‌లో యువతి ఫిర్యాదు చేసింది. తనని పెళ్లి చేసుకుంటానని మోసగించిన యువకునితో పెళ్లి చేసి న్యాయం చేయాలని కోరింది. దీంతో స్థానిక ఎస్సై కౌన్సిలింగ్ సైతం నిర్వహించడం జరిగింది. అయితే పెళ్లి చేసుకుంటానని మాట ఇచ్చిన యువకుడు తాను పెళ్లి చేసుకునేది లేదని మొండికి వేయడంతో పోలీసులు చేసేదిలేక ఫిర్యాదు చేస్తే కేసు పెడతామని పేర్కొన్నారు. ఇక తనకు న్యాయం జరగదని గ్రామానికి వెళ్లిన యువతి ప్రియుడి ఇంట్లోనే తిష్ట వేసింది.

'కొత్తగా రేషన్ కార్డుల నాటకం'

సిరికొండ రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా రేషన్‌కార్డుల మంజూరు నాటకం ఆడుతోందని బీఆర్‌ఎస్ మండల నాయకులు ఓరగంటి పెంటన్న అన్నారు. మండలకేంద్రంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నిలబెట్టిన అభ్యర్థులు గెలుస్తున్నారని సర్వే రిపోర్టు చెప్పడంతో కాంగ్రెస్ రేషన్‌కార్డుల జారీ నాటకం ఆడుతోందని ఆయన ఆరోపించారు. ప్రజలను పీడిస్తూ దరఖాస్తుల పేరిట ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నారని పలు విమర్శలు చేశారు.

బైక్ దొంగల అరెస్ట్

ఆదిలాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలో ఇటీవలే స్కూటీ దొంగతనం జరిగిన కేసులో ఇద్దరు దొంగలను పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని లాండసాంగ్వి వెళ్లే దారిలో శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా మహారాష్ట్రకు చెందిన షర్కురే ప్రదీప్, జాగేశ్వర్ నన్నవార్ అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో పోలీసులు వారిని తనిఖీ చేయగా దొంగలించిన వాహనం తీసుకొచ్చినట్లు గుర్తించారు. ఈ మేరకు వారిని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి వారి నుంచి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఇందులో ఎస్సైలు అశోక్, సయ్యద్ ఇసాక్ అలీ, పద్మ, కానిస్టేబుల్ ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

ఆదిలాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఓ ఆటో డ్రైవర్ ప్రయాణికుడి సంచి అప్పగించి తన నిజాయితీ చాటుకున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని చిలుకూరి లక్ష్మీనగర్‌కు చెందిన సాజిద్ అనే ఆటో డ్రైవర్ ఆటోలో శనివారం లాండసాంగ్వికి చెందిన మేకల రాములు అనే ప్రయాణికుడు పట్టణంలోని ఓ హాస్పిటల్ వెళ్లేందుకు ఆటో ఎక్కి దిగాడు. అనంతరం ఆటోలో ప్రయాణికుడు సంచి మరిచిపోయాడు. గమనించిన ఆటో డ్రైవర్ ఆ సంచిలో రూ.6 వేలు ఉండడంతో వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అందజేశారు. అక్కడ సీఐ సునీల్ కుమార్ చేతుల మీదుగా సంచిని, నగదును ప్రయాణికుడికి అందజేశారు. నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్‌ను సీఐ అభినందించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

ఆదిలాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ పొన్నం సాయికుమార్ జన్మదినం సందర్భంగా జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఇందులో ఎంఈవో నర్సయ్య, రాహుల్, సాయి గౌడ్, కిరణ్, గోపి, వంశీ, రుద్ర, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ఇచ్చోడ, ఫిబ్రవరి, 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందిన ఘటన మండలంలో చోటుచెసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన గయక్‌వాడ్ అంకుష్, అతని బార్య జ్యోతి తన ఇద్దరు పిల్లలతో కలిసి శుక్రవారం రాత్రి 9గంటల ప్రాంతంలో మండలంలోని జున్నిలోని బంధువుల ఇంటికి బస్సులో రాగా.. బస్సు దిగి రహదారి దాటే క్రమంలో జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జ్యోతి(29) అక్కడికక్కడే మృతిచెందగా.. అంకుష్ తీవ్ర గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని గుర్తించి ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

శబ్ద కాలుష్య వాహనాలపై చర్యలు : ఎస్సై

ఆదిలాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): బైక్ సైలెన్సర్‌లను మార్పులు చేసి శబ్ద కాలుష్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ పేర్కొన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి శబ్ద కాలుష్యానికి కారణమైన వాహనాలను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరోసారి పునరావృతమైతే మోటార్ వెహికల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై ఈ సందర్భంగా హెచ్చరించారు.

విద్యార్థిని దండించిన వార్డెన్‌పై కేసు

ఇచ్చోడ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల వసతిగృహంలోని 7వ తరగతి విద్యార్థిని కొట్టిన వార్డెన్‌పై శనివారం కేసు నమోదైంది. సరిగ్గా చదవడం లేదని వసతి గృహంలో ఉంటూ ప్రైవేటు పాఠశాలలో చదివే విద్యార్థి సంతోష్‌ను వార్డెన్ నిరంజన్ చేయిచేసుకున్నాడు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు.

ఆర్జీయూకేటీలో డ్రోన్ టెక్నాలజీ వర్క్‌షాప్



డ్రోన్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిపుణులు

బాసర, ఫిబ్రవరి, 8 : (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం, టీహాన్ ఐఐటీ హైదరాబాద్ సహకారంతో డిజైన్ అండ్ ఫ్లై ది డ్రోన్స్ పేరుతో ఐదు రోజుల వర్క్‌షాప్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీతో అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ టీహాన్ ఐఐటీ కలిసి పెట్టుకోవడంతో ఎంతో సంతోషించదగ్గ విషయమని తెలిపారు. డ్రోన్ టెక్నాలజీలో అధునాతన పరిజ్ఞానంతో విద్యార్థులను సన్నద్ధం చేయడం, ఆవిష్కరణ, పరిశోధన, వృత్తిపరమైన వృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ వర్క్‌షాపులో వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రముఖ నిపుణులు డాక్టర్ కే.కృష్ణ నాయక్, డాక్టర్ ఈశ్వర్ మూర్తి కేవీ. డాక్టర్ కే. నాగరాజులు సెషన్‌లలో పాల్గొంటారని తెలిపారు. డ్రోన్ పరిణామం, రకాలు, ఏరో డైనమిక్స్ కంట్రోల్ మెకానిజమ్స్ వంటి అంశాలను ప్రస్తావిస్తూ విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై సమగ్ర జ్ఞానాన్ని అందించామన్నారు. ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులకు డాక్టర్ సంతోష్ టీహాన్ ఐఐటీ హైదరాబాద్‌లోని ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు, పరిశోధన చేయుటకు అవకాశం కల్పించడం ముఖ్యాంశమని పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్ ద్వారా డ్రోన్ టెక్నాలజీ, సంబంధిత రంగాలలో విద్యార్థుల కేరీర్ అవకాశాలు మెరుగుపరుస్తుందని కోఆర్డినేటర్ డాక్టర్ రాకేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్స్, హెచ్‌ఓడీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అవినీతి పాలనకు ఢిల్లీ ప్రజలు చరమగీతం పాడారు

● ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పాటిల్

భైంసా, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలు, కుంభకోణాల పాలనకు ఢిల్లీ ప్రజలు చరమగీతం పాడారని ముథోల్ ఎమ్మెల్యే రామరావు పాటిల్ పేర్కొన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ విజయభేరిని మోగించడాన్ని పురస్కరించుకొని శనివారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. లక్ష్య సాధనలో అఖండ విజయం సాధించిన విజేతలకు, పార్టీ శ్రేణులన్నింటికీ శుభాకాంక్షలు తెలిపారు. గత దశాబ్ద కాలంగా మోసపూరిత హామీలతో బూటకపు వాగ్దానాలతో అవినీతి. అక్రమాలకు పాల్పడిన కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీకి అక్కడి ప్రజలు సరైన రీతిలో గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీపై పూర్తి విశ్వాసంతో అక్కడి ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని పేర్కొన్నారు. ఢిల్లీ గెలుపుతో ప్రజలకు మోదీపై ఉన్న నమ్మకం, విశ్వాసం మరోసారి రుజువైందన్నారు. రాష్ట్రంలో రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న శివ భక్తుల పూజలు

కుంటాల, ఫిబ్రవరి, 8 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని సూర్యాపూర్ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివ భక్తుల పూజలు కొనసాగుతున్నాయి. మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని గత కొద్ది రోజుల నుండి సూర్యాపూర్ గ్రామస్తులే కాకుండా పక్క గ్రామాలకు చెందిన భక్తులు సైతం శివ మాలలు స్వీకరించారు. ప్రతిరోజు ఒకపూట బోజన ం చేస్తూ ఉదయం సాయంత్రం అల్పాహారంతో శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ శివనామస్మరణ చేస్తున్నారు. శనివారం సూర్యపూర్ రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అధిక సంఖ్యలో స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వచ్చే వన మహోత్సవం నాటికి మొక్కలు సిద్ధం చేయాలి



న్యూ లోలం అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో సరదాగా అదనపు కలెక్టర్

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : వచ్చే వనమహోత్సవం ప్రారంభం నాటికి నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సిద్ధం చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శనివారం దిలావర్‌పూర్ మండలంలోని న్యూ లోలం గ్రామంలో ఆకస్మికంగా పర్యటించి అధికారులను హడలెత్తించారు. ముందుగా గ్రామంలోని నర్సరీని సందర్శించి పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు పలు కీలక సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు మొక్కలకు నీటితో పాటు పోషకాలను అందిస్తూ మొక్కల ఎదుగుదలను పరిశీలిస్తూ ఉండాలన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. చిన్నారులకు నాణ్యమైన సమతుల్య ఆహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. చిన్నారుల కోసం చేసిన ఆహారాన్ని రుచి చూసి నిర్వాహకులను అభినందించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలను ఆకట్టుకునేలా ఏర్పాటు చేసిన ఆట బొమ్మలు, పెయింటింగ్స్, తదితర సౌకర్యాలపై అంగన్‌వాడీ టీచర్‌ను అభినందించారు. అంగన్‌వాడీ పరిసరాల్లో మెరుగైన పారిశుద్ధ్యం నిర్వహించాలన్నారు. చిన్న పిల్లలతో అదనపు కలెక్టర్ కాసేపు సరదాగా గడిపారు. గ్రామంలో చెత్త, సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించి పలు సూచనలు చేశారు. సెగ్రిగేషన్ కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దని ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట నిర్మల్ సీడీపీవో నాగమణి ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు నోడల్ అధికారుల నియామకం



పదో తరగతి విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రస్తుతం అడ్మిషన్లను పెంచేందుకు ఇంటర్మీడియట్ బోర్డు వినూత్న కార్యక్రమానికి శ్రీకారంచుట్టింది. ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్య ఆదేశాలతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులను ఆ కళాశాల పరిధిలోని ప్రతి ఉన్నత పాఠశాలకు ఒక లెక్చరర్‌ను నోడల్ అధికారిగా నియమించారు. ఆయా పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ తీసుకునే విధంగా కార్యాచరణ రూపొందించారు. అందులో భాగంగా శనివారం దిలావర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులను నోడల్ అధికారులుగా నియమించారు. కెమిస్ట్రీ అధ్యాపకుడు నర్సయ్యను నర్సాపూర్(జి) ఉన్నత పాఠశాలకు, ఫిజిక్స్ అధ్యాపకుడు కృష్ణను కల్లూరు ఉన్నత పాఠశాలకు, కామర్స్ అధ్యాపకుడు జైపాల్‌ను తిమ్మాపూర్ ఉన్నత పాఠశాలకు నోడల్ అధికారులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు వారి పాఠశాలలకు వెళ్లి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. దిలావర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందిస్తున్న గ్రూప్ వివరాలతో పాటు ఉచిత విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉపకార వేతనాలతో పాటు ఒత్తిడి లేని విద్యను అందించేందుకు సమగ్రమైన ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెంచేందుకు విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ముందుకు వెళ్తామని అధ్యాపకులు పేర్కొన్నారు.

నూతన ఆబ్కారీ సీఐకి సన్మానం

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఆబ్కారీ సర్కిల్ కార్యాలయంలో ఇటీవల నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన ఎం. రంగస్వామిని గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేసినట్లు జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోపి గౌడ్, రాష్ట్ర కమిటీ నాయకులు పడాల రాజేందర్ గౌడ్, కొండ బాలగౌడ్, తీగల వెంకట్ గౌడ్, పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలించిన మామడ ఎంపీడీవో

మామడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మామడ మండలం పొన్కల్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని శనివారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెల్మ సుశీల్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి పోలింగ్ బూత్‌కు ర్యాంప్ తప్పని సరిగా ఉండాలన్నారు.

పోలింగ్‌బూత్‌లను పరిశీలించిన ఎంపీడీవో



పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ముథోల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలు త్వరలో నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం ముథోల్‌లోని ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో పోలింగ్ బూత్‌లను కేటాయించారు. అయితే వాటిని ఎంపీడీవో శివ కుమార్ పరిశీలించారు. దీంతో అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

హోరెత్తిన బీజేపీ విజయోత్సవ సంబరాలు



భైంసాలో విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

భైంసా, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):: ఢిల్లీ అసెంబ్లీ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో ఆ పార్టీ శ్రేణులు చేపట్టిన విజయోత్సవ సంబరాలు హోరెత్తాయి. శనివారం మధ్యాహ్నం పార్టీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, మండల అధ్యక్షురాలు సిరం సుష్మారెడ్డిల నేతృత్వంలో బీజేపీ శ్రేణులు చేపట్టిన విజయోత్సవ సంబరాలు ఆద్యాంతం జోరుగా.. హుషారుగా కొనసాగాయి. విజయోత్సవ సంబరాల్లో బాగంగా పార్టీ శ్రేణులు ఒకరినొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ ప్రవేశ మార్గంలో టపాసులు కాల్చారు.పలువురు పార్టీ ప్రతినిధులు నృత్యాలతో హోరెత్తించారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ నాయకత్వానికి బలపరుస్తూ ప్రదర్శనలు చేపట్టారు. విజయోత్సవ సంబరాల్లో పార్టీ ప్రతినిధులు గౌతం పింగ్లే, రావుల పోశెట్టి, సోలంకే భీంరావ్ పాటిల్, వడ్నపు శ్రీనివాస్, రావుల రాము, మానిక్ దగ్దే, గాలి రాజు, రేవాజీ నర్సయ్య, దత్తు, ముల్లావార్ అనిల్, కాసరి ప్రవీణ్ , హన్మాండ్లులతో పాటు పలువురు పాల్గొన్నారు.

నిర్మల్‌లో..

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ భారీ మెజార్టీతో గెలవడంతో బీజేపీ పార్టీ కార్యాలయంలో శనివారం సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, స్టేట్ కౌన్సిల్ మెంబర్ అయ్యన్నగారి రాజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర రెడ్డి, మేడిసెమ్మె రాజు, రాచకొండ సాగర్, శ్రావణ్‌రెడ్డి, మండల అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కడెంలో ..

కడెం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కడెం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు శనివారం సంబరాలు చేసుకున్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాన రహదారిపై టపాసులు కాల్చుతూ మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కాశవేణి శ్రీనివాస్ యాదవ్, శ్రీరామ్ కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో ..

ఖానాపూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : శనివారం వెలువడిన ఢిల్లీ అసెంబ్లీ ఫలితాల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో ఖానాపూర్‌లో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ తల్లి చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పార్టీ శ్రేణులు ఒకరికొకరు మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంకం మహేందర్, పుప్పాల ఉపేందర్, రవీందర్‌రెడ్డి, ఎడ్ల రాజేశ్వర్, తదితరులున్నారు.

ఢిల్లీ విజయం చారిత్రాత్మకం

మామడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ భారీ విజయం సాధించడంతో ఆ విజయం చారిత్రాత్మకమని బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు రంజిత్ కుమార్ అన్నారు. అవినీతి పరులను ప్రజలు ఇంటికి సాగనంపుతారని అనడానికి ఢిల్లీ ఎన్నికలు నిదర్శనమన్నారు. మూడోసారి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో జీరోలోనే ఉందని ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మే స్థితిలో లేరన్నారు.

ఫటా..ఫట్...

రైతులకు అందుబాటులో గడ్డి విత్తనాలు

● డా.ప్రకాష్ కాంబ్లే, పశువైద్యాధికారి, కుభీర్



ఆంధ్రజ్యోతి : మండల రైతులకు ,పశుపోషకులకు మీరందించే రాయితీ పథకాలు ఏంటీ?

పశువైద్యాధికారి : ప్రస్తుతం రాయితీపై గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఆసక్తిగత రైతులు తమ పట్టా పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్సులను పత్రాలను అందించి 5కేజీల గడ్డి విత్తనాల బస్తాను పొందగలరు.

ఆంధ్రజ్యోతి: పశువులకు వ్యాధులు సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి...?

పశువైద్యాధికారి : కలుషిత నీటిని పశువులుఉ తాగకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలి. కలుషిత నీటి ద్వారా పశువుల్లో తీవ్రంగా జ్వరానికి గురయి కండరాల నొప్పులు వచ్చి నీరసించి పోతాయి. వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించి నివారణకు మందులు పొందాలి.

ఆంధ్రజ్యోతి : పశువులు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పశుపోషకులకు రైతులకు మీరిచ్చే సూచనలు, సలహాలేంటి. ?

పశువైద్యాధికారి : రైతులు ముందస్తు జాగ్రత్తగా టీకాలను వేయించాలి. ముఖ్యంగా గొర్రెల్లో చిటుకు రోగం వ్యాధి సోకకుండా చూడాలి. టీకాలను వేయించాలి, డాక్టరు సూచనను పాటించాలి

ఆంధ్రజ్యోతి : మండలంలో పశువైద్య శిబిరాలు నిర్వహించారా..?

పశువైద్యాధికారి : ప్రతీ సంవత్సరం మండలంలోని గ్రామాల్లో శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాము. ఇప్పుడు ఫిబ్రవరి నెలకరులో గోడాపూర్ గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించనున్నాము. పశుపోషకులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

• (ఆంధ్రజ్యోతి, కుభీర్)

మండల పరిషత్ ఎన్నికల వైపు అధికారులు

పాత బిల్లుల వైపు మాజీ ఎంపీటీసీల చూపు

ఉట్నూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలను బలోపేతం చేయడానికి ప్రతీ ఐదేళ్లకు ఓ సారి ప్రభుత్వాలు మండల పరిషత్ ఎన్నికలు నిర్వహిస్తూ వస్తున్నాయి. 2019లో మండల పరిషత్ ఎన్నికల నిర్వహించిన ప్రభుత్వంలో బాధ్యతలు స్వీకరించిన ఎంపీపీలు, ఎంపీటీసీలు పదవి కాలం గత జూలై మాసంలో ముగిసింది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ముందుగా వస్తాయని అందరు భావిస్తుండగా ఏడు నెలల విరామం అనంతరం మండల పరిషత్ ఎన్నికలు ముందుగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ నేపథ్యంలో మండల పరిషత్ అధికారులు సైతం ఎంపీటీసీల స్థానాలను, ఓటర్ల జాబితాలను గ్రామ పంచాయతీలు వారీగా సిద్ధం చేశారు. ఇది వరకు ఉట్నూర్ మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ఈ సారి ఉట్నూర్ గ్రామ పంచాయతీ ఎన్నికలు ఏర్పాటు జరుగడంతో ఉట్నూర్ మండల కేంద్రంలోని నాలుగు ఎంపీటీసీ స్థానాలను అదనంగా గుర్తించడం వల్ల 18 ఎంపీటీసీ స్థానాలు అయ్యాయి. పులిమడుగు ఎంపీటీసీ స్థానం సాకేరబి, పులిమడుగు, జమల్‌తండా, చింతకర్ర గ్రామ పంచాయతీల ఓటర్లు ఉంటారు. అదేవిధంగా నర్సాపూర్ ఎంపీటీసీ స్థానంలో నర్సాపూర్ బి, జైత్రంతండా గ్రామ పంచాయతీలు, సాలెవాడ బి పరిధిలో వడగల్పూర్ కె, సాలెవాడ కె, తాండ్ర, బాబాపూర్, సాలెవాడ బి పంచాయతీలు, షాంపూర్ ఎంపీటీసీ పరిధిలో కుమ్మరి తండా, షాంపూర్, ఏందా పంచాయతీలు, ఉమ్మడి ఎంపీటీసీ పరిధిలో చాందూరి, మరుగూడ, శ్యాంనాయక్‌తండాలు, హస్నాపూర్ ఎంపీటీసీ స్థానంలో హస్నాపూర్ పంచాయతీ, నాగపూర్ ఎంపీటీసీ పరిధలో టక్కుగూడ, ఎక్స్‌రోడ్, నాగపూర్ పంచాయతీలు, ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో 1, 2, 3, 4, ఎంపీటీసీ స్థానాలు, లక్కారం గ్రామ పంచాయతీ పరిధిలో 1, 2 రెండు ఎంపీటీసీ స్థానాలు, ఘన్నూర్, మత్తడిగూడ పంచాయతీలు కలుపుకొని ఘన్నూర్ ఎంపీటీసీ స్థానం, గంగాపూర్ ఎంపీటీసీ పరిధిలో కామాయిపేట, గంగాపూర్, కన్నాపూర్, లక్కేటిపేట పంచాయతీ లు, దంతనపల్లి ఎంపీటీసీ స్థానంలో గోండుగూడాజి, దంతంపల్లి, చెరువుగూడ, దొంగ చింత పంచాయతీలు, బీర్సాయిపేట ఎంపీటీసీ పరిధిలో నర్సాపూర్ జె, బీర్సాయిపేట, హీరాపూర్ జె గ్రామ పంచాయతీలను చేరుస్తూ 18 ఎంపీటీసీ స్థానాలను గుర్తించారు. ఉట్నూర్ మండలంలో 32 988 మంది మొత్తంఓటర్లు ఉన్నారు.

● ఆర్థిక ఇబ్బందుల్లో మాజీ ఎంపీటీసీలు

సకాలంలో ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న కనీస అవసరాలను తీర్చడాని కి స్థానిక ప్రజా ప్రతినిధులు కృషి చేస్తారు. కాని గత ప్రభుత్వం నుంచి నేటి ప్రభుత్వం వరకు స్థానిక సంస్థలకు నిధులు కేటాయించక పోవడంతో ఆయా ప్రాంతాల స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు అప్పుల పాలై ఆర్థిక ఇబ్బందుల్లో మునిగి ఉన్నారు. ఈ నేపథ్యంలోనే కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సర్పంచ్ ఎన్నికల కంటే ముందే మండల పరిషత్ ఎన్నికలను నిర్వహించాలని భావిస్తుండడంతో మాజీ ఎంపీటీసీలు ఈ ఎన్నికల్లో ఎలా పోటీ చేసేదని వాపోతున్నారు. 2019లో జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో ఆయా ప్రాంతాల మండల పరిషత్ అధ్యక్షులతో పాటు ఎంపీటీసీలు మూడేళ్ల పాటు చక్కగా పనులు చేశారు 2023 కంటే ముందు నుంచి ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులు కేటాయించడంలో జాప్యం చేస్తూ వచ్చింది. ఫలితంగా ప్రాంతాల నుంచి ఎన్నికైన మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం సభ్యులు గ్రామాలలో మురికి కాలువలు, వీధిలైట్ల స్థంభాలు, అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు చేయించడంతో ప్రతి ఎంపీటీసీ సుమారు పది లక్షల నుంచి 15 లక్షల వరకు అప్పులు చేసి పనులు నిర్వహించారు. గత ప్రభుత్వం 2023లో ఎలాంటి నిధులు విడుదల చేయక పోవడంతో ఎంపీటీసీలు సైతం పనులు చేయలేదు. అంతకు ముందు చేసిన పనులకు సంబంధించిన నిధులు ఒక ఉట్నూర్ మండలంలోనే రెండు కోట్ల వరకు రావాల్సి ఉంటుందని మాజీ ఎంపీటీసీలు పేర్కొంటున్నారు.



ఉట్నూర్ ఎంపీడీవో కార్యాలయం

అప్పుల పాలైన ఎంపీటీసీలు

● పంద్ర జైవంత్‌రావు, మాజీ ఎంపీపీ, ఉట్నూర్



గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలు తీర్చడానికి అప్పులు చేసి ఎంపీటీసీలు అభివృద్ధి పనులను నిర్వహించారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయక పోవడంతో మాజీ ఎంపీటీసీలు అందరు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల కంటే ముందు ప్రభుత్వ మాజీ ఎంపీటీసీలు చేసిన పనుల బిల్లులను చెల్లించి ఆదుకోవాలి.



వేంకటేశ్వర స్వామివారికి కల్యాణం జరిపిస్తున్న పండితులు

వైభవంగా గుండంపల్లి వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండంపల్లిలో శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. శనివారం ఉదయం 11 గంటలకు శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి పండితులు కల్యాణం జరిపించారు. అంతకుముందు ఎదుర్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వామివారు అలక బూనడం, అమ్మవార్ల తరుపువారు బుజ్జగించే ఘట్టం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీ వెంకటేశ్వర స్వామివారు మంగళ సూత్రధారణ చేశారు. ఈ సమయంలో భక్తులు ఏడుకొండల వాడా వెంకటరమణా గోవిందా... గోవిందా నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. స్వామివారి కల్యాణ వేడుకను వీక్షించేందుకు పరిసర గ్రామాలకు చెందిన అనేక మంది భక్తులు వచ్చారు. అనంతరం భక్తులు స్వామివారికి కట్నకానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా రామ దూత ధ్యాన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

భక్తి

● భక్త జన సందోహంతో కిటకిటలాడిన కాల్వ అడవులు



ధ్యాన హనుమాన్ స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కొలువైన కాల్వ అడవులు శనివారం భక్త జన సందోహంతో కిక్కిరిశాయి. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి చెంతనే ధ్యాన హనుమాన్ కొలువు దీరారు. ఒకవైపు పండితుల వేద ఘోష... మరోవైపు హనుమాన్ భక్తుల జై శ్రీరామ్.. జై హనుమాన్ నినాదాలతో కాల్వ అడవులు దద్దరిల్లాయి. 18 అడుగుల ఏకశిలా ధ్యాన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు మూడు రోజులుగా కొనసాగాయి. శనివారం తెల్లవారు జామున ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ధ్యాన ముద్రలో ఉన్న రామ దూత హనుమంతుడు కొలువుదీరాడు. విగ్రహ దాత అయిండ్ల చంద్రమోహన్ రెడ్డి దంప తుల చేత ధ్యాన హనుమాన్ స్వామికి పంచామృత అభిషేకం చేయించారు. అనంతరం భక్తులకు ధ్యాన హనుమాన్ స్వామిని దర్శించుకునేందుకు అనుమతించారు. మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పైడిపల్లి రవీందర్ రావు, నిర్మల్ మాజీ ఎమ్మెల్యే బీజేపీ నాయకులు నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్ తదితరులతో పాటు పలువురు ప్రముఖులు ధ్యాన హనుమాన్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేల మంది భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా విగ్రహాన్ని చెక్కిన ఆళ్లగడ్డకు చెందిన శిల్పి దంపతులను పలువురు ఘనంగా సత్కరించారు. వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. స్థానిక ఎస్సై సందీప్‌తో పాటు నర్సాపూర్(జి) ఎస్సై సాయికిరణ్, నిర్మల్ రూరల్ ఎస్సై లింబాద్రిల ఆధ్వర్యంలో 60 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



హాజరైన గ్రామస్థులు



నందిగామలో నూతనంగా నిర్మించిన నందీశ్వర శివాలయం

నందిగామలో 10న నందీశ్వర శివాలయం విగ్రహ ప్రతిష్ఠాపన

● ఆలయంలో ప్రారంభమైన యజ్ఞ కార్యక్రమాలు

తలమడుగు రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఉమ్మడి బరంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని నందిగామ గ్రామ సమీపంలో వాగులో స్వయంభుగా నంది నోటి నుంచి నీటి ప్రవాహం గల అతి పురాతనమైన శివాలయం దాదాపు 150 సంవత్సరాల చరిత్ర గల నందీశ్వర ఆలయాన్ని పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన శివాలయం నూతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఈ నెల 8 నుంచి 10 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణ ప్రదాత మాది డిసిసిబి చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జన్మగా జన్మించినందుకు మానవ జన్మన సార్థకం చేసుకునేందుకు ధర్మ మార్గాలు ఎన్నో ఉన్నాయని ఇందులో ముఖ్యంగా. శివాలయం నిర్మించడం గత జన్మ సుకృతంగా భావించి ఈ అవకాశం లభించినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు చుట్టుకొండలు కొండల మధ్య ప్రవహించేటి జల హేరు జల హేరులో నందీశ్వరుడు ప్రత్యక్షమవడం నందీశ్వర ఆల నిర్మించడం ఎం తో ఆనందంగా ఉందన్నారు. ఈ నెల 10న వేద పండితులతో నూతన శివాలయం ప్రారంభం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శనివారం ఆలయంలో వేద పండితులతో యజ్ఞ కార్యక్రమాలు ప్రారంభించడం జరిగిందన్నారు. అదేవిధంగా గ్రామీణ క్రీడాకారణ ప్రోత్సహించేందుకు గ్రామస్థుల సహకారంతో వాలీబాల్ పోటీలను ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయంలో మాజీ విజయ డైరీ చైర్మన్ లోకా భూమారెడ్డి. మాజీ సర్పంచ్ ముడుపు భూమారెడ్డి, సామాజిక కార్యకర్త వ్యాపారవేత్త ప్రేమేందర్ రెడ్డి, కేదఆరేశ్వర్ రెడ్డి, మౌనిష్ రెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి, గ్రామ పెద్దలు కోవ లక్ష్మణ్ పటేల్, కనక సురేందర్, మాజన్ సీడం శంభూ, మెస్రం చలపతిరావు, పాఠశాల ఉపాధ్యాయుడు దివాకర్, సీఈవో మోతే శ్రీనివాస్, సాగర్, సెక్యూరిటీలు అనిల్ రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



శివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

పచ్చని పంట పొలాలకు భూగర్భ జల శోకం

బోథ్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూగర్భ జలాలు శరవేగంగా అడుగంటి పోతున్నాయి. దీంతో పంటలు సాగుచేసే రైతులు దిగాలు చెందుతున్నారు. కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే వాటిని పరిరక్షించుకునేందుకు రైతులు అడుగంటిన భూగర్భ జలాలను పైకి తేవడానికి తాపత్రయ పడుతు న్నారు.



భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బోరు బావికి మరమ్మతు చేస్తున్న రైతులు

● ఊరు చుట్టూ పచ్చని పంటలే

మండలంలోని దన్నూరు గ్రామం దట్టమైన అడవి కొండ కోనల మధ్య ఉండడంతో భూగర్భ జలాలు ప్రతి ఏడాది పుష్కలంగా ఉంటాయి. అయితే ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో అకస్మాత్తుగా భూగర్భం నీటిమట్టం తగ్గిపోయింది. పంటలు వేసిన రైతులు చేసేది ఏమి లేక పాతాళంలో దాగి ఉన్న నీటిని బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. వందలాది ఎకరాల్లో పచ్చని పంటలకు నీరు లేక భూగర్భ నీటి శోకం తప్పేట్టు లేదు.

కొనసాగుతున్న శివ భక్తుల పూజలు

కుంటాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూర్యపూర్ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివ భక్తుల పూజలు కొనసాగుతున్నాయి. మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని గత కొద్ది రోజుల నుంచి సూర్యాపూర్ గ్రామస్థులే కాకుండా పక్క గ్రామాలకు చెందిన భక్తులు సైతం శివ మాలలు స్వీకరించారు. ప్రతీ రోజు ఒక పూట భోజనం చేస్తూ ఉదయం సాయంత్రం అల్పాహారంతో శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ శివ నామస్మరణ చేస్తున్నారు. శనివారం సూర్యపూర్ రాజ రాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అధిక సంఖ్యలో స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.



సూర్యాపూర్ రాజరాజేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రైతుల ఖాతాల్లో ఇదివరకే రూ. 11.86 కోట్లు

సన్నాల బోనస్ నిధుల జమ

● రైతుల ఖాతాల్లో మరో రూ. 4.80 కోట్లు జమ చేస్తాం ● 'సన్నాల బోనస్ సంగతేమిటి' కథనంపై అధికారుల స్పందన ● ఏడుగురు రైస్‌మిల్ యజమానుల నుంచి రెవెన్యూ రికవరీ

నిర్మల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): 'సన్నాల బోనస్ సంగతేమిటి' అనే శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 2024-25 ఖరీఫ్ సీజన్‌కు గాను 20,698 మంది రైతుల నుంచి 80839.600 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వారు పేర్కొన్నారు. 8,870 మంది రైతుల నుంచి 33345.480 మెట్రిక్ టన్నుల సన్న రకం వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కొనుగోళ్ల తాలూకు రైతుల ఖాతాల్లో రూ.264.91 కోట్లను జమ చేసినట్లు వారు పేర్కొన్నారు. కాగా తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సన్న రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500ల చొప్పున 8,870 మంది రైతుల నుంచి సేకరించిన 33345.480 మెట్రిక్ టన్నుల సన్న రకం వరి ధాన్యానికి రూ. 16కోట్ల 67 లక్షల 27 వేల 400లు చెల్లిం చాల్సి ఉండగా ఇప్పటి వరకు ప్రభుత్వం 11 కోట్ల 86 లక్షల 57 వేల రూపాయలను ఆయా రైతుల ఖాతాల్లో జమ చేసి నట్లు పేర్కొన్నారు. ఇంకా 4 కోట్ల 80 లక్షల 70 వేల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉందని, ప్రభుత్వం నుండి సదరు నిధులు మంజూరు కాగానే ఆయా రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ అవుతాయని పేర్కొన్నారు. జిల్లాలో నిర్దేశించిన గడువులోగా ప్రభుత్వానికి సీఎం ఆర్ అందజేయని 12 రైస్ మిల్లులపై చర్యలు తీసు కునేందుకు ప్రభ త్వానికి నివేదిక పంపినట్లు పేర్కొన్నారు. ఇందులో తొమ్మిది మంది మిల్లుల యజమానులపై ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఏడుగురు మిల్లుల యజమానులపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇందు లో భాగంగా సదరు మిల్లు యజమానుల నుంచి రూ. 113 కోట్ల నిధులను రికవరీ చేయవలసి ఉందన్నారు. అంతేకాకుండా వీరి నుంచి రూ.28 కోట్లను రుసుము రూపంలో వసూలు చేస్తామ న్నారు. ని బంధనల ప్రకారం నడుమకోని మిల్లులకు 2024- 25 సంవత్సరానికి గాను వరి ధాన్యాన్ని కేటాయించలేదని పేర్కొన్నారు. అంతేకాకుండా జిల్లాలో రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైస్ మిల్లులపై ఎప్పటికప్పుడు దాడులు నిర్వహిస్తూ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.



ఇంకా ప్రారంభం కాని ఉపాధి హామీ పనులు


● పనులు లేక కూలీల అవస్థలు
● పట్టించుకోని అధికారులు
● కార్యాలయాల చుట్టూ ఉపాధి హామీ కూలీలు

తలమడుగు రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ కూలీలకు వేసవి కాలంలో ఉపాధి కల్పించాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రారంభించి ప్రతీ కూలికి ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ప్రవేశపెట్టిన పథకం కొంత మంది అధికారులు నిర్లక్ష్యంతో కూలీలకు పని కల్పించడంతో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో ఇప్పటి వరకు ఉపాధి హామీ పనులు అధికారులు ప్రారంభించకపోవడంతో పనులు లేక కూలీలు అవస్థలు పడుతున్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ మాసం నుంచి ఉపాధిహామీ పనులు ప్రారంభమయ్యేవి కాని ఈ సంవత్సరం ఫిబ్రవరి మాసం ప్రారంభమైనప్పటికీ ఇంకా పనులను అధికారులు ప్రారంభించడం లేదు. ఈ సంవత్సరం ప్రకృతి వైపరీత్యా పంటల పండకపోవడంతో రైతులు, కూలీలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. పనులు లేక ఇంటి వద్దనే కూలీలు ఉండవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మరి కొంత మంది పోలీసులు ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారు. ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించేందుకు గ్రామసభల్లో పనులకు గుర్తించినప్పటికీ ఆ పనులను ఇంకా ప్రారంభించలేదు. ఉపాధి హామీ అధికారులు మాత్రం మండల కేంద్రానికి పరిమితం అవుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా మండలంలో 28 గ్రామ పంచాయతీలకు గాను ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన వారు 12 వేల మంది ఉన్నారు. అదే విధంగా ప్రతి సంవత్సరం పనులకు వెళ్లే కూలీల సంఖ్య ఐదు వేలకు పైగా మంది కూలీలు పనులకు వెళుతున్నారు. ఉపాధిహామీ పనులకు వెళ్లే కూలీలకు ప్రభుత్వం ప్రతిరోజు 300 రూపాయల కూలీ డబ్బులు చెల్లిస్తుంది. ఉపాధిహామీ చట్ట ప్రకారం ప్రతి కూలీకి చేసిన పనులకు డబ్బులు చెల్లించాలని ఆదేశాలు ఉన్నాయి. ఉపాధిహామీలో కూలీలకు పని కల్పించేందుకు దాదాపు 52 రకాల పనులు ఉన్నప్పటికీ అందులో కొన్నిటి పనులే కూలీలకు కల్పిస్తున్నారు. నర్సరీలు, మొక్కలు నాటడం, పశువుల షెడ్లు, రాళ్ళ కట్టల ఏర్పాటు, చెరువుల పనుల పూడిక తీత, గుంతలు తవ్వడం తదితర పనులను కూలీలకు కల్పిస్తున్నారు. కాని అధికారులు మెటీరియల్ పనులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి త్వరగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను ప్రారంభించి అర్హులైన కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.




తలమడుగులో ఉపాధి హామీ పనులు చేపడుతున్న కూలీలు (ఫైల్)

● ఉపాధి పనులను త్వరగా ప్రారంభించాలి



ఈ సంవత్సరం పంటలు పండక, పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు, కూలీలు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం చేయడానికి పను లు ఏమి లేవు. అధికారులు స్పందించి త్వరగా ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి. అంతేకాకుండా నిబంధనల పేరిట కూలీలను ఇబ్బంది పెట్టవద్దు.

\- కారే ఉశన్న, ఉపాధి కూలీ, తలమడుగు



మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

కుంటాల, ఫిబ్రవరి, 8 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని ఆయా గ్రామాలలో కొందరు మైనర్లకు తల్లిదండ్రులు ద్విచక్రవాహనాలు ఇస్తున్నారని దీని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కావున మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని కుంటాల ఎస్సై భాస్కరా చారి పేర్కొన్నారు. శనివారం పలు గ్రామాలకు చెందిన చిన్నారుల తల్లిదండ్రులను పిలిపించి వారికి మైనర్లకు వాహనాలు ఇవ్వడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వాహనాలు ఇవ్వకూడదని అవగాహన కల్పించారు. మరోసారి మైనర్లు వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు పెట్టాల్సి వస్తుందని ఆయన సూచించారు.

ఊపందుకున్న యాసంగిసాగు





ఎడ్ల బండిలో వరినారును తీసుకెళ్తున్న యువ రైతు

- కడెం, గడ్డెన్నవాగు, స్వర్ణప్రాజెక్టులతో పాటు సరస్వతీ కెనాల్, సదర్మాట్ ద్వారా పంటలకు సాగు నీరు
- పుష్కలమైన నీటి వనరులతో రెండో పంట సాగుపై రైతన్న ఉత్సాహం
- ముమ్మరంగా వరినాట్లు
- ఆశాజనకంగా పెరుగుతున్న మొక్కజొన్న
- నువ్వు, శనగ పంటలపై సైతం అన్నదాతల ఆశలు
- జిల్లావ్యాప్తంగా ఈ యాసంగిలో 3.02 లక్షల ఎకరాల్లో ఆయా పంటల సాగు
- నాట్లు వేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు కూలీల బృందాలు

ఖానాపూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి వనరులు ఆశాజనకంగా ఉండడంతో జిల్లాలో రెండో పంట సాగు రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా యాసంగి పనుల్లో అన్న దాతలు తలమునకలయ్యారు. ఓవైపు వ్యవసాయ బావులపై ఆధారపడిన రైతాంగ మంతా ఇదివరకే వరినాట్లను పూర్తి చేసుకున్నారు. మరోవైపు కడెం ప్రాజెక్టు, గడ్డెన్నవాగు ప్రాజెక్టు, స్వర్ణప్రాజెక్టుతో పాటు సరస్వతీ కెనాల్, సదర్మాట్ కెనాల్, డి- 27, 28 లాంటి పంట కాలువలపై ఆధారపడి రైతాంగం ప్రస్తుతం వరినాట్లు వేయడంలో బిజీగా మారారు. జిల్లాలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో కూలీల కొరత ఎక్కువగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. కూలీల కొరతను అధిగమించేందుకు బీహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూలీలను తెచ్చి జిల్లావ్యాప్తంగా పలుచోట్ల వరినాట్లు వేయిస్తున్నారు. సదరు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కూలీల బృందాలు వారే వరినారు మళ్ల నుంచి నారు సేకరించడం, బురద మళ్లలో నారు పంచేయడంతో పాటు నాట్లు కూడా వేస్తున్నారు. దీనికి గాను రైతుల వద్ద నుంచి ఎకరానికి రూ.5 వేల చొప్పున తీసుకుంటున్నారని చెబుతున్నారు. మరోపక్క జిల్లాలో ఈ యాసంగిలో మొక్కజొన్న, జొన్న, శనగ, నువ్వు లాంటి పంటలను సాగుచేస్తున్నారు. ఇందుకుగాను ఎరువుల కొరత లేకుండా ఇదివరకే జిల్లా అధికారులు చర్యలు చేపట్టినట్లు చెబుతున్నారు.

రెండో పంటకు సరిపడా సాగునీరు

ఈ ఏడాది యాసంగి పంటకు సాగునీటికి ఎటువంటి ఢోకా లేదనే ధీమాను రైతాంగం వ్యక్తం చేస్తోంది. జిల్లావ్యాప్తంగా ఉన్న సాగునీటి ప్రాజెక్టుల్లో యాసంగి పంటకు సరిపడా పుష్కలమైన నీరు ఉన్నట్లు రైతు లతో పాటు అధికారులు చెబుతున్నారు. నీటి నిల్వాలు పుష్కలంగా ఉన్నప్పటికీ నీటిని వృధా చేయకుండా పంటలకు వాడుకోవాలని ఇదివరకే అధికార వర్గాలు రైతాంగానికి విన్నవించాయి. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎస్సారెస్పీ సరస్వతీ కెనాల్, సదర్మాట్, కడెం ప్రాజెక్టు, స్వర్ణ ప్రాజెక్టు, గడ్డెన్నవాగు ప్రాజెక్టుల ఆయకట్టు పరిధిలోని వ్యవసాయ భూములను సాగుచేస్తున్న రైతాంగానికి ఇక్కట్లు లేకుండా ఇదివరకే యాసంగి పంటకు నీటి విడుదల నిరంతరాయంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా రైతాంగం సైతం రెట్టింపు ఉత్సాహంతో ఈ ఏడాది రెండో పంటను సాగు చేస్తున్నట్లు చెబుతున్నారు.



ఆశాజనకంగా పెరుగుతున్న మొక్కజొన్న పంట

ముమ్మరంగా వరినాట్లు

యాసంగిలో నీటిఎద్దడిని దృష్టిలో ఉంచుకొని పలువురు రైతులు దొడ్డు రకం ధాన్యాన్ని పండించేందుకు మొగ్గుచూపుతారు. అందులో భాగంగా జిల్లావ్యాప్తంగా ఈ యాసంగిలో 1.10 లక్షల ఎకరాల్లో వరిపంటను సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇదివరకే వ్యవ సాయ బావులపై ఆధారపడిన వ్యవసాయ క్షేత్రాలలో వరినాట్లు పూర్తయి ప్రస్తుతం నాటు ముదిరే దశలో వరి క్షేత్రాలు ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. కాగా పంట కాలువలపై ఆధారపడిన వ్యవసాయక్షేత్రంలో మాత్రం తాజాగా ముమ్మరంగా వరి నాట్లు సాగుతున్నాయి. వరినాట్లు జోరందుకున్న నేప థ్యంలో పలుచోట్ల కూలీల కొరత నెలకొనడంతో బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూలీల బృందాలను దిగుమతి చేసుకుని వరినాట్లను వేయిస్తున్నారు. నారు సేకరించడం నుంచి నాటు వేసే వరకు ఒక ఎకరానికి 5,000ల చొప్పున రైతుల నుంచి స్వీకరిస్తున్నట్లు పక్క రాష్ట్రాల బృందాలు నాట్లను సైతం ఆకర్షణీయంగా వేస్తుండడంతో రైతులు సదరు కూలీల కోసం మొగ్గు చూపుతున్నట్లు చెబుతున్నారు. ముందస్తుగా వరినాట్లు పూర్తయిన క్షేత్రాల్లో పొలం కలుపు తీసేందుకు వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. ఇలా ప్రస్తుతం వరిసాగు చేస్తున్న రైతన్న ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యవసాయ పనుల్లో తలమునక లవ్వాల్సిన పరిస్థితి నెలకొందంటున్నారు.

ఈ యాసంగిలో 3.02 లక్షల ఎకరాల్లో ఆయా పంటల సాగు

ఈ ఏడాది యాసంగిలో జిల్లా వ్యాప్తంగా రైతాంగం 3.02 లక్షల ఎకరాల్లో ఆయా పంటలను సాగుచేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ యాసంగిలో 1.10 లక్షల ఎకరాల్లో వరి పంట, 1.02 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంట, 55 వేల ఎకరాల్లో శనగ పంట, 35 వేల ఎకరాల్లో జొన్న పంట, 1000 ఎకరాల్లో పల్లి, పొద్దుతిరుగుడు ఇతర పంటలను సాగు చేయనున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో సాగు చేస్తున్న పంటలకు సరిపడా ఎరువులను సిద్ధంగా ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఈ యాసంగిలో సాగు చేస్తున్న ఆయా రకాల పంటలకు గాను 37 వేల మెట్రిక్ టన్నుల యూరియా, ఎనిమిది వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, 14 వేల మెట్రిక్ టన్నుల 20 - 20 లాంటి ఎరువులు ప్రధానంగా అవసరం పడతాయని అధికారులు ముందస్తుగానే సిద్ధం చేసిన ప్రణాళిక ప్రకారం ఆయా ఎరువులను అందుబాటులో ఉంచినట్లు చెబుతున్నారు. ఈ ఎరువులను నెలవారి అవసరాల ప్రకారం మార్కెట్‌లో రైతులకు అందుబాటులో ఉంటాయని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.



కడెం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా పంట పొలాలకు వెళ్తున్న సాగునీరు

పురుగుల మందు తాగి మహిళ మృతి

పెంబి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి మాలావత్ సానుక(22) మృతి చెందిన సంఘటన మండలంలోని పోచంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై హన్మాండ్లు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన సానుకను తన భర్త విజయ్ కుమార్ మొక్క జొన్న పంటకు నీళ్లు అందించాలని చెప్పడంతో క్షణికావేశంతో ఈ నెల 3న పురుగుల మందు తాగడంతో వెంటనే నిర్మల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్త, కొడుకు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హజ్ యాత్రికులకు శిక్షణ



రాష్ట్ర హజ్ సొసైటీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న గ్రంథాలయ చైర్మన్

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సోఫీనగర్ ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉమ్మడి జిల్లా హల్ యాత్రికులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించినట్లు రాష్ట్ర హజ్ సొసైటీ అధ్యక్షులు సయ్యద్ గులాం అఫ్జల్‌బియాబాని పాషా తెలిపారు. రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు ఇలియాస్ కాస్మి యాత్రలో చేయవలసిన పద్ధతులను క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సయ్యద్ అర్జున్ అలీ, వివిధ జిల్లాల హజ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి వెంట మురుగు తంటా

కుబీర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వివేకానంద స్వామి చౌరస్తా నుండి మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తోంది. వాహనాల రాకపోకలతో గుంతలు ఏర్పడి మురుగు నీరు నిలుస్తోంది. ఈ రహదారి గుండ ఎంపీడీవో, ఉపాధిహామి, ఐకేపీ , విద్యావనరుల కేంద్రం, వ్యవసాయశాఖ, పంచాయతీ రాజ్, మిషన్‌భగీరథతో పాటుఉ ఆయా శాఖల అధికారులు మండల పరిషత్‌తో పాటు ఆయా కార్యాలయానికి రాకపోకులు చేస్తుంటారు. అయిన ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదని ఆ రహదారి గుండా వెళ్లే కస్రా, సొనారి, మాలేగాం, నిగ్వా, కుప్టి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురికి నీటిని రహదారి వైపు మళ్ళించిన కాంప్లెక్స్ యజమానిపపై చర్యలు తీసుకొని ప్రమాదాలు జరుగకుండా రహదారికి మరమ్మత్తులు చేయాలని కోరుతున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కుబీర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో వైద్య పరీక్షలుఉ నిర్వహించారు.

ఈ సందర్భంగా డా. అవినాష్ రాథోడ్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ముఖ్యంగా రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల సంక్షేమ అధికారి నాయుడు చిన్నన్న, ఆరోగ్య సిబ్బంది తదితరులున్నారు.

వైభవంగా ప్రారంభమైన శ్రీ అభయాంజనేయాది విగ్రహ ప్రతిష్ఠాపన

- విగ్రహాలతో శోభాయాత్ర
- భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులు



ఆలయ ప్రాంగణంలో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు



శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

భైంసా, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని భాగ్యనగర్ కాలనీ పరిధిలో భవ్యంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ నూతన మందిర ప్రారంభోత్సవ, శ్రీ అభయాంజనేయాది విగ్రహాల పతిష్టాపన మహోత్సవాలు శనివారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగనున్న ప్రతిష్ఠాపన మహోత్సవాలలో భాగంగా తొలిరోజు ప్రతిష్ఠించే విగ్రహాలకు కాలనీ ప్రధాన రోడ్డు మార్గం నుంచి ఆలయం వరకు శోభయాత్రగా తీసుకవెళ్లారు. కాలనీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభయాత్రలో భాగ్యనగర్ కాలనీవాసులతో పాటు పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాలవాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మహిళ భక్తులు ముందుగా తమ తమ నివాస గృహాల నుంచి ఆలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి బాజభజంత్రీల మధ్య కాలనీ ప్రవేశ మార్గానికి శోభయాత్రగా చేరుకున్నారు. అక్కడ ప్రతిష్ఠాపనోత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శోభాయమానంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై శ్రీ అభయాంజనేయ ఆలయం వరకు శోభయాత్ర తీసుకవెళ్లారు. భక్తుల కోలాహలం మధ్య శోభయాత్ర ఆద్యాంతం సంప్రదాయబద్ధంగా కొనసాగింది. మహిళమూర్తులు మంగళహారతులతో గేయాల ఆలపిస్తూ శోభయాత్రలో భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతిష్ఠాపనోత్సవాలలో భాగంగా ఆలయ ప్రాంగణంలో వేద పండితుల ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది.

లారీలో అక్రమంగా తరలిస్తున్న 699 బస్తాల రేషన్‌బియ్యం పట్టివేత

- రోడ్డు ప్రమాదంతో వెలుగు చూసిన రేషన్ బియ్యం అక్రమ సరఫరా
- లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసిన పోలీసుశాఖ



భైంసాలో రేషన్ బియ్యం బస్తాలతో పట్టుబడిన లారీ



విచారణ జరుపుతున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్, డీసీఎస్‌వో కిరణ్‌కుమార్

భైంసా, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా మీదుగా అక్రమంగా లారీలో తరలుతున్న 699 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడింది. శుక్రవారం రాత్రి భైంసా పట్టణ పరిధిలోని శివాజీ చౌక్ వద్ద సంబంధిత లారీ యూ టర్న్ తీసుకునే క్రమంలో కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు లారీని అపివేసి గాయపడిన కారు డ్రైవర్‌ను వైద్య సేవల నిమిత్తం ఇక్కడి ఏరియా ఆసుపత్రికి తరలించారు. తదనంతరం ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు కారును ఢీకొట్టిన లారీని ఘటన స్థలి నుంచి పోలీసు స్టేషన్‌కు తరలించారు.శనివారం ఉదయం పోలీసులు లారీని పరిశీలించగా అందులో పెద్ద మొత్తం బస్తాలలో బియ్యం నిల్వలు ఉండటాన్ని గుర్తించిన నేపథ్యంలో అక్రమ బియ్యం సరఫరా ఘటన వెలుగు చూసింది. పోలీసుల సమాచారం మేరకు భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్‌లు బియ్యాన్ని పరిశీలించి అవి రేషన్ షాపులకు సంబంధించిన పీడీఎస్ బియ్యంగా గుర్తించారు. పట్టుబడిన బియ్యం వివరాలను సివిల్ సప్లయ్ అధికారులకు అందించారు.దీంతో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కిరణ్ కుమార్ భైంసాకు తరలివచ్చి పట్టుబడిన బియ్యాన్ని పరిశీలించి పీడీఎస్ రైస్‌గా గుర్తించారు. వెంటనే పట్టుబడిన లారీని భైంసాలోని సివిల్ సప్లయ్ మండల్ లెవల్ స్టాకిస్టు కేంద్రానికి తరలించారు. అక్కడ పోలీసు, సివిల్ సప్లయ్ అధికారులు పంచనామ నిర్వహించారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న సివిల్ సప్లయ్ అధికారులు అక్రమ బియ్యం సరఫరాపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో భైంసా టౌన్ ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి బియ్యాన్ని అక్రమంగా సరఫరా చేస్తున్న లారీని సీజ్ చేశారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని బియ్యం ఎక్కడి నుంచి ఎక్కడికి సరఫరా చేస్తున్నారనే విషయంలో ధర్యాప్తు ప్రారంభించారు.

ముథోల్‌లో ఔరంగజేబు కాలం నాటి వెండి నాణేలు లభ్యం



నాణేలు పరిశీలిస్తున్న తహసీల్దార్, తదితరులు

ముథోల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని బోయిగల్లీలో ఓ వ్యక్తి తన పశువుల పాక తొలగించి నూతన ఇంటి నిర్మాణం కోసం పునాది పనులు చేపడుతుండగా ఔరంగజేబు కాలం నాటి 92 నాణేలు బయట పడ్డాయి. పూర్తి వివరాల్లోకి వెళ్లే ముథోల్‌కు చెందిన లూటే మారుతి తన పశువుల పాక తొలగించి నూతన ఇంటి నిర్మాణం కొరకు శుక్రవారం పునాది పనులు కూలీలతో చేపడుతున్నారు. అయితే పునాది (పిల్లర్లరంధ్రాలు) తవ్వుతుండగా ఒక మట్టి కుండ గడ్డపారకు తగిలి అందులోంచి నాణేలు బయట పడ్డాయి. దీంతో విషయం గ్రహించిన ఇంటి నిర్మాణం యజమాని లూటే మారుతి ఈ విషయం ముథోల్ ఎస్సై సంజీవ్‌కు తెలి పారు. శనివారం ఎస్సై సంజీవ్, తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ నారాయణ పటేల్‌లు నాణేలు బయట పడ్డ స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. సంబంధిత నాణేలను తహసీల్దార్ శ్రీకాంత్‌కు అప్పజెప్పారు. పంచనామ నిర్వ హించి ఈ నాణేలను స్వాధీన పరుచుకొని ముథోల్ ఉపకోశాధికారి కార్యాలయంలో డిపాజిట్ చేస్తున్నట్లు తహ సీల్దార్ తెలిపారు. పురాతన కాలం నాటి నాణేలని ఊర్లో తెలియడంతో ప్రజలు వాటిని చూడడానికి తరలివచ్చారు. దొరికిన నాణేలు మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు క్రీ. శ 1540 - క్రీ. శ1842 మధ్య కాలంలో ముద్రించబడిన నాణేలని సుమారు 350 సంవత్సరం కాలం నాటివిగా భావిస్తున్నారు.

ఘనంగా ఆంజనేయ ఆలయ వార్షికోత్సవం

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చింతకుంట వాడలో కొలువుదీరిన శ్రీ ఆంజనేయ శివ పంచాయతన నవగ్రహ ఆలయ 6వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్నుల పండువగా నిర్వహించిన యజ్ఞ, హోమ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం లక్కడి జగన్మోహన్‌రెడ్డి సోదరులు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దేవరశెట్టి రాజేశ్వర్, దొడ్ల రాజేశ్వర్ తదితరులతో పాటు స్థానిక నాయకులు మోహన్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, గంధ్రత్ రాజేశ్వర్, కందుల బాపు, తదితరులు పాల్గొన్నారు.

మందిర నిర్మాణానికి స్థలం కేటాయింపు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీలో రాంజీ గోండు గల్లీలో హనుమాన్, ఆదివాసి దేవత మందిరం నిర్మాణానికి స్థలం కేటాయించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ విజ్ఞప్తి మేరకు రెవెన్యూ అధికారులు స్పందించి తగిన స్థలాన్ని సేకరించారని, ఈ స్థలంలో గద్దె కట్టి మందిర నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు ఆనంద రావు, భీమ్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సోయం సూర్యభాను, విజయ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి పలువురి పరామర్శ

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అక్కయ్య పొద్దుటూరి అరుంధతి ఇటీవల స్వర్గస్తులయ్యారు. శనివారం రోజు హైదరాబాద్‌లో నిర్వహించిన ద్వాదశ దినకర్మ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు హాజరై అరుంధతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యుత్ వైర్లను తాకే చెట్ల కొమ్మల నరికివేత

కడెం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కడెం మండలంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేశారు. విద్యుత్ శాఖ ఏఈ రాంసింగ్ ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. శనివారం పెద్దూర్ సబ్ స్టేషన్ నుండి కడెం వరకు ప్రధాన రహదారికి పక్కన ఉన్న విద్యుత్ వైర్లను తాకే చెట్ల కొమ్మలను తొలగించారు.

రైతులకు పంటలపై అవగాహన

కడెం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్దిపడగ, లింగాపూర్, మాసాయిపేట్, సారంగాపూర్, దిల్దార్‌నగర్, ఎలగడప గ్రామాలకు చెందిన రైతులతో డీఈఈ నవీన్ లింగాపూర్ రైతువేదిక భవనంలో సమావేశాన్ని నిర్వహించారు. పంట పొలాలకు వారబంది పద్ధతిలో నీటిని విడుదల చేస్తామని వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ మాట్లాడుతూ... నీటి విడుదల ప్రణాళికతో ఎటువంటి పంటలు వేసుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.